నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
13 | హైదరాబాద్, ఆదివారం 21 జనవరి 2024 | RANGAREDDY



## అట్ట ముక్కలతో రామ మందిరం

బొంరాస్‌పేట, జనవరి 20 : అట్ట ముక్కలు, బంకమట్టితో అరచేతిలో ఇమిడే విధంగా అయోధ్య శ్రీరామ మందిరాన్ని తయారు చేసి తన నైపుణ్యాన్ని చాటుకుంది వికారాబాద్ మండలం మద్గుల్ చిట్టెంపల్లి గ్రామానికి సాయిప్రియ. అయోధ్యలో ఈ నెల 22వ తేదీన శ్రీరాముని విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ జరుగనున్న వేళ సాయిప్రియ రామ మందిరాన్ని రూపొందించి తన భక్తిని చాటుకున్నది.



# టార్గెట్ 100%

- ప్రభుత్వ బడుల్లో వందశాతం ఉత్తీర్ణతే విద్యాశాఖ లక్ష్యం
- ఉత్తమ ఫలితాలు సాధించేలా కార్యాచరణ అమలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై స్పెషల్ ఫోకస్..
- ప్రతినెలా మోడల్ పరీక్షల నిర్వహణ



షాబాద్, జనవరి 20 : పదోతరగతి పరీక్షల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యాశాఖ పక్కాప్లాన్‌తో ముందుకెళ్తున్నది. ప్రతిసారి మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుల్లో అధిక మొత్తంలో విద్యార్థులు ఫెయిలవుతుండడంతో వీటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలన్నీ 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. విద్యార్థుల మేధస్సును బట్టి మూడు గ్రూపులుగా విభజించి స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై మరింత శ్రద్ధ పెడుతున్నారు. నవంబర్ మొదటి వారం నుంచి పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు అన్ని సబ్జెక్టులకు సంబంధించి స్లిప్ టెస్టులతోపాటు మోడల్ టెస్టులు నిర్వహిస్తూ విద్యార్థుల్లోని భయాన్ని పోగొట్టి భరోసా నింపుతున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. రోజుకో సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా అభ్యాస దీపికలను కూడా అందజేశారు. గతంలోని ప్రశ్నాపత్రాలపై విద్యార్థులతో కసరత్తు చేయిస్తున్నారు. ఈ ఏడాది రంగారెడ్డి జిల్లాలో 50,287 మంది విద్యార్థులు పదోతరగతి వార్షిక పరీక్షలకు హాజరుకానుండగా, వికారాబాద్ జిల్లాలో 13,074 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

### ఉత్తమ గ్రేడ్‌లూ సాధించేలా..

వికారాబాద్ జిల్లాలో వందశాతం సిలబస్ పూర్తికాగా, రంగారెడ్డి జిల్లాలో డిసెంబర్ నాటికి 70 శాతానికి పైగా సిలబస్ పూర్తయింది. ఈ నెలాఖరు వరకు వందశాతం పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. కాగా, మార్చిలో పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తుండడంతో ఒత్తిడిని తట్టుకుని పరీక్షలు రాసేలా ఇప్పటినుంచే విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఉత్తమ గ్రేడ్‌లు సాధించేలా ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులకు మెళకువలు నేర్పుతున్నారు. మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి.

### 10జీపీఏ సాధించడమే లక్ష్యం..



ఈ ఏడాది పదో తరగతి పరీక్షలో 10 జీపీఏ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రత్యేక తరగతుల ద్వారా మా ఉపాధ్యాయులు అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలలో ఉదయం గంట, సాయంత్రం గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకు ఒక సబ్జెక్టుపై సార్ వాళ్లు మాకు పాఠాలు బోధిస్తున్నారు. మాకు ఏమైనా సందేహాలు ఉన్నా సార్ వాళ్ల దృష్టికి తీసుకువెళితే పరిష్కరిస్తున్నారు.

**-వైష్ణవి, పదవ తరగతి, తెలంగాణ మోడల్ పాఠశాల, షాబాద్**

### ప్రత్యేక తరగతులతో మేలు..



మా పాఠశాలలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకో సబ్జెక్టు ద్వారా పరీక్షలపై పాఠాలు బోధించి మా ఉపాధ్యాయులు మాకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేక తరగతులు మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తాను.

**-కార్తీక్, పదవ తరగతి, తెలంగాణ మోడల్ పాఠశాల, షాబాద్**

### వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పదోతరగతిలో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. సబ్జెక్టుల వారీగా సందేహాలను నివృత్తి చేసుకుంటూ ముందుకెళ్తున్నాం. సిలబస్ ప్రకారం బోధిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించాం.

**-సుశీందర్‌రావు, రంగారెడ్డి డీఈవో**

### ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు..



పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాం. నవంబర్ 10 నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే సిలబస్ పూర్తయింది. ప్రతి సబ్జెక్టుకు మోడల్ పేపర్లను తయారు చేసి టెస్ట్‌లను కూడా నిర్వహిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించేలా చూస్తున్నాం.

**-రేణుకాదేవి, వికారాబాద్ డీఈవో**

**జిల్లాలో గత డిసెంబర్, ప్రస్తుత డిసెంబర్ నెలల్లో నమోదైన భూగర్భ జల మట్టాలు(మీటర్లలో)**

| మండలం | డిసెంబర్ 2022 | డిసెంబర్ 2023 |
|---|---|---|
| అబ్దుల్లాపూర్‌మెట్ | 4.44 | 6.60 |
| ఆమనగల్లు | 4.83 | 7.42 |
| బాలాపూర్ | 5.05 | 8.06 |
| చేవెళ్ల | 8.14 | 9.93 |
| చౌదరిగూడెం | 4.63 | 7.30 |
| ఫరూఖ్‌నగర్ | 6.45 | 8.21 |
| గండిపేట | 9.07 | 10.84 |
| హయత్‌నగర్ | 5.00 | 12.95 |
| ఇబ్రహీంపట్నం | 7.25 | 12.37 |
| కడ్తాల్ | 6.59 | 10.51 |
| కందుకూరు | 2.42 | 6.70 |
| కేశంపేట | 3.63 | 3.98 |
| కొందుర్గు | 4.20 | 5.06 |
| కొత్తూరు | 5.37 | 8.38 |
| మాడ్గుల | 5.66 | 8.17 |
| మహేశ్వరం | 6.62 | 9.20 |
| మంచాల | 4.15 | 9.23 |
| మొయినాబాద్ | 7.13 | 7.42 |
| నందిగామ | 3.83 | 9.11 |
| రాజేంద్రనగర్ | 8.96 | 9.38 |
| సరూర్‌నగర్ | 6.84 | 9.41 |
| శేరిలింగంపల్లి | 11.13 | 26.42 |
| షాబాద్ | 6.10 | 8.14 |
| శంషాబాద్ | 6.79 | 7.77 |
| శంకర్‌పల్లి | 7.79 | 8.61 |
| తలకొండపల్లి | 8.31 | 14.44 |
| యాచారం | 3.18 | 6.33 |

గత ఏడాది డిసెంబర్‌తో పోలిస్తే 2.74 మీటర్ల లోతుకు పడిపోయిన భూగర్భ జలాలు

శేరిలింగంపల్లిలో 26.42 మీటర్ల లోతుల్లో భూగర్భ నీటి మట్టం

నీటి వనరుల్లోనూ అడుగంటుతున్న జలాలు

ఈసారి తాగునీటికి కటకటే!

సేద్యంపైనా తీవ్ర ప్రభావం..

ఇప్పటికీ 11 వేల ఎకరాలు సైతం దాటని యాసంగి సాగు

# జలగండం

రంగారెడ్డి, జనవరి 20(నమస్తే తెలంగాణ) : వేసవికి ముందే జిల్లాలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి వనరులు అడుగంటిపోతున్నాయి. మరోపక్క రోజురోజుకూ భూగర్భజల మట్టం పాతాళానికి పడిపోతున్నది. బోరు బావులు బోరుమంటుండడంతో ఈసారి తాగునీటికి కటకట ఏర్పడనున్నది. గత ఏడాది డిసెంబర్‌తో పోలిస్తే ప్రస్తుత డిసెంబర్‌లో భూగర్భ జలాలు 2.74 మీటర్ల లోతుల్లోకి వెళ్లాయి. వ్యవసాయానికి సైతం నీటి గండం పొంచి ఉన్నది. సాగు నీటి కొరత దృష్ట్యా జిల్లాలో యాసంగి సాగు ఇప్పటివరకు 11 వేల ఎకరాలు కూడా దాటలేదు.

### తాగునీటికీ ఇబ్బందులే..

భూగర్భజలాలు అడుగంటిపోతుండడం రైతులను ఆందోళన కలిగిస్తున్నది. భూగర్భ జల శాఖ అధికారులు ప్యూజోమీటర్ ఆధారంగా విడుదల చేసిన నివేదికలు రానున్న రోజుల్లో పొంచి ఉన్న నీటి ఇబ్బందులకు సంకేతాలిస్తున్నాయి. గత ఏడాది డిసెంబర్ నెలలో జిల్లాలో భూగర్భజలాలు 5.94 మీటర్ల లోతులోనే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుత డిసెంబర్‌లో 8.68 మీటర్ల లోతుల్లోకి భూగర్భ జలాలు వెళ్లిపోయాయి. గతంతో పోలిస్తే ఈసారి 2.74 మీటర్ల లోతుల్లోకి నీటి మట్టం పడిపోయింది. శేరిలింగంపల్లిలో 26.42 మీటర్ల లోతుల్లో బోరు వేస్తే గానీ.. భూగర్భ జలాలు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. కేశంపేట మండలంలో మాత్రం 3.98 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు ఉండడం ఊరట కలిగిస్తున్నది. డిసెంబర్ నెలలోనే ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం.. వచ్చేది వేసవి కాలం కావడంతో భవిష్యత్తును తల్చుకుని ప్రజానీకం ఆందోళన చెందుతున్నది.

### యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం..

ఓ వైపు నీటి వనరుల్లో జలాలు.. మరో వైపు భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయి. ప్రస్తుత పరిస్థితులు యాసంగి సాగుపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. జిల్లాలో చాలా వరకు బోరు, బావుల ద్వారానే వ్యవసాయం సాగుతున్నది. రానున్న రోజుల్లో బోర్లు ఎండిపోతే పరిస్థితి ఏంటన్న మీమాంసలో రైతులున్నారు. దీనికితోడు రైతులకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రైతు బంధు అందలేదు. ఎకరా, రెండెకరాల్లో ఉన్న రైతులకు మాత్రమే వచ్చాయి. పెట్టుబడి పెట్టి పంటలు వేస్తే.. చేతికి వస్తాయా? గిట్టుబాటు అవుతుందో లేదో? అన్న ఆందోళనలో జిల్లా రైతులున్నారు. ఈ పరిస్థితుల్లో పంటలను సాగు చేసే సాహసం చేయలేకపోతున్నారు. యాసంగి సాగు 80 వేల ఎకరాల్లో ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసినప్పటికీ.. ఇప్పటివరకు జిల్లాలో వివిధ రకాల పంటలు 10,350 ఎకరాల్లోనే సాగయ్యాయి. 50 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా ఉంది. అయితే 11,360 ఎకరాల్లో నాటేందుకు నారు మడి సిద్ధంగా ఉండగా.. ఇప్పటివరకు కేవలం 669 ఎకరాల్లోనే నాట్లు పడ్డాయి.

**యాసంగిలో జిల్లాలో పంటల సాగు వివరాలు ఎకరాల్లో..**

| పంట | ఇప్పటివరకు సాగు విస్తీర్ణం |
|---|---|
| వరి | 669 |
| జొన్న | 156 |
| మొక్కజొన్న | 1,064 |
| శనగలు | 1,281 |
| వేరుశనగ | 5,343 |
| పొద్దు తిరుగుడు | 84 |
| కుసుమ | 1,584 |
| పత్తి | 118 |
| ఇతర పంటలు | 51 |



ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాలలో స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

# అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

వికారాబాద్/తుర్కయాంజాల్, జనవరి 20 : 18 ఏండ్లు నిండిన యువతీయువకులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఓటు నమోదు స్పెషల్ డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇతర ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న వ్యక్తులు మరోచోట ఓటును నమోదు చేసుకోవద్దని సూచించారు. మరణించినవారి డెత్ సర్టిఫికెట్‌ను పరిశీలించి లేదా స్థానికంగా విచారణ చేపట్టి ఓటును తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, తహసీల్దార్ రవీందర్ దత్తు, డీఈఈ సత్యనారాయణ, ఆర్ఐ భిక్షపతి పాల్గొన్నారు.

### పారదర్శకంగా చేపట్టాలి

### వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

ఓటర్ నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా బూత్ స్థాయి అధికారులు చొరవ చూపాలని వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. శనివారం వికారాబాద్ సంఘం లక్ష్మీబాయి ఉన్నత పాఠశాలల ఆవరణలో ఏర్పాటుచేసిన ఓటు నమోదు ప్రత్యేక శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదు, ఓటర్ ఐడీ కార్డులో మార్పులు, చేర్పులకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటరుగా రెండుసార్లు నమోదు కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో తొలగింపులు, దిద్దుబాట్లకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో వస్తున్న దరఖాస్తులపై ఆయన బీఎల్‌వోలను ఆరా తీశారు. కలెక్టర్ వెంట వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



ఓటరు నమోదు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# నయా జోష్‌తో ఎన్నికలకు సిద్ధం కావాలి

**అభివృద్ధి, సంక్షేమం కంటే అబద్ధం గెలిచింది**

**హామీలు అమలు చేయలేకే కాంగ్రెస్ శ్వేతపత్రాలు**

**చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి**

**పరిగి, పూడూరులో బీఆర్‌ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం**

పరిగి/పూడూరు, జనవరి 20 : పార్లమెంటు ఎన్నికలకు బీఆర్‌ఎస్ శ్రేణులు నయా జోష్‌తో సిద్ధం కావాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి సూచించారు. శనివారం పరిగిలోని బృందావన్ గార్డెన్‌ల, పూడూరులలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాల న్నారు. శనివారం బీఆర్‌ఎస్ పార్టీ పూడూరు మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీలకు గెలుపోటములు సహజమని, నాయకులు, కార్యకర్తలు నిరాశ చెందకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు బంధు, రైతు రుణమాఫీ డబ్బులు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసినందుకు రైతులు కూడా నిరాశతో ఉన్నారని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తనకు చెప్పారని, ఈసారి పరిగి నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ వచ్చేలా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే మూడు నెలలు కష్టపడి పార్టీ కోసం పనిచేయండి, ఐదేండ్లు మీ కోసం పనిచేస్తానని, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై శ్వేతపత్రాలు పెడదామన్నారు. దేశం మరింత ముందుకు పోవాలనే తపనతోనే పార్టీని బీఆర్‌ఎస్‌గా విస్తరించారని తెలిపారు. ప్రజాతీర్పును గౌరవిస్తూ, ప్రజల పక్షాన, ప్రజల గొంతుకగా ఉంటూ పాత పద్ధతిలో పోరాటం కొనసాగిద్దామని ఎంపీ సూచించారు.

### తొమ్మిదిన్నరేండ్లలో ప్రతి పేద ఇంటికి సంక్షేమ పథకాలు

తొమ్మిదిన్నర సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి పేద ఇంటికి సంక్షేమ పథకాలు నేరుగా చేరాయని ఎంపీ గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కంటే అబద్ధం గెలిచిందన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారంతో గెలిచిన కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో 420 హామీలున్నాయన్నారు. హామీలు అమలు చేయడం చేతకాక శ్వేతపత్రాల పేరిట కొత్త నాటకానికి ప్రభుత్వం తెర తీసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 111వ హామీ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధిస్తామని ఉందని, జాతీయ హోదా కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక పర్యాయాలు కేంద్రానికి విన్నవించిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి పనులను పరిశీలించిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్‌కు నివేదిక ఇవ్వగా.. రూ.5వేల కోట్ల విలువ చేసే పనులకు టెండర్లు పిలువగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఎంపీ విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

### ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే ప్రజలు గ్యాస్ సిలిండర్ల కోసం లైన్‌లో నిలబడడం ప్రారంభమైందని, ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఎంపీ పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రైవేటు బస్సుల్లో రద్దీ వల్ల కేఎంపీఎల్ తగ్గిందని, తమకు పాత ధరలు సరిపోవంటూ బస్సుల యజమానులు ఆందోళన చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు రూ.3.5 లక్షల కోట్లు అవసరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశం బీఆర్‌ఎస్‌కు లేదని, ఐదేండ్లు ప్రతిపక్షంలో ఉందామని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారన్నారు. పోలీసు అకాడమీ జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఫోర్ లేన్ రోడ్డు గతంలో మంజూరవగా.. తాము మంజూరు చేయించామని ప్రస్తుత ఎమ్మెల్యే చెప్పుకోవడం విడ్డూరమన్నారు. ముందుగా మీరు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సూచించారు.

### గెలుపోటములు సహజం

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గెలుపోటములు సహజమని, నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజల కోసం, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు పోరాటం చేద్దామన్నారు. పార్లమెంటులో అత్యధికంగా ప్రశ్నలు అడిగిన ఎంపీ రంజిత్‌రెడ్డి అని, వికారాబాద్ జిల్లాను జోగులాంబ జోన్ నుంచి చార్మినార్ జోన్ పరిధిలోకి మార్చడంలో, జిల్లాకు మెడికల్ కళాశాల రావడంలో ప్రత్యేక కృషి చేశారన్నారు. గతంలో ఎంపీలు సంవత్సరానికి ఒక్కసారన్న ఈ ప్రాంతాలకు వచ్చేవారు కారని, ఎంపీ రంజిత్‌రెడ్డి గెలిచాక ప్రతి కార్యక్రమానికి హాజరయ్యారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పరిగి నియోజకవర్గ నాయకులు రాబోయే పార్లమెంట్ ఎన్నికలో ఎంపీగా రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం అరవిందరావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పీఏసీఎస్ చైర్మన్ కె.శ్యాంసుందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయకులు బి.సుభాష్‌చందర్‌రెడ్డి, మేడిద రాజేందర్, బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పి.వెంకటయ్య, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కె.వెంకట్‌రాంరెడ్డి, పార్టీ పూడూరు మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జడ్పీటీసీ మేఘమాల, రాష్ట్ర నాయకుడు కె.అనిల్‌రెడ్డి, రైతుబంధు సమితి కన్వీనర్ రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు అజారుద్దీన్, సొసైటీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, అజీం, రాంచంద్రారెడ్డి, వెంకటయ్య, రాజేందర్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పరిగి సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి

# మరింత మెరుగైన సేవలు అందించాలి

సేవా పతకాలు పొందిన సిబ్బందిని అభినందించిన సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

సిటీబ్యూరో, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ప్రజా రక్షణ, విధి నిర్వహణలో అసామాన్యమైన ప్రతిభ కనబరుస్తూ, ప్రజలకు అందించే సేవలతో పోలీస్ సిబ్బందికి గుర్తింపు లభిస్తుందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సైబరాబాద్ పోలీస్ సిబ్బందికి 2023వ సంవత్సరానికిగాను 138 మందికి ఉత్తమ సేవా పతకాలు ప్రభుత్వం ప్రకటించింది, ఇందులో 58 ఉత్కృష్ట, 80 సేవా పతకాలున్నాయి. ఈ పతకాలను శనివారం కమిషనరేట్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బందికి సీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహించడం, అందులో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎలాంటి రిమార్కులు లేకుండా పతకాలు పొందడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో విధుల పట్ల అంకితభావం, మంచి ప్రతిభ కనబరుస్తూ ప్రజలకు పోలీసులు సేవలు అందిస్తూ, పోలీస్ శాఖకు మరింత మంచి పేరు ప్రతిష్టలు వచ్చేలా విధులు నిర్వహించాలని సీపీ సూచించారు. భవిష్యత్తులో మరింత మెరుగుగా పనిచేస్తూ మరిన్ని పతకాలు సాధించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ నారాయణ్ నాయక్, డీసీపీ రవి చందన్‌రెడ్డి, అదనపు డీసీపీ షమీర్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.